# చుక్క



ఆ రోజు జనరల్ కంపార్టుమెంటు మరింత రద్దీగా ఉంది.

చంకలో చంటిపిల్ల గుక్కపట్టి ఏడుస్తుంటే, చుక్క బలవంతంగా రైలెక్కి జనాన్ని తోసుకుని ఒకచోట కూర్చోగలిగింది. రైలు ఎక్కుతుంటే ఆమె నెత్తి మీది మూట అందుకున్న వారెవరో తిరిగి ఆ మూట తెచ్చి ఆమె పక్కనే పడేశారు.

ఎవరో వెంటపడి తరుముతున్నట్టు ఆమె గుండె అంతసేపు వేగంగా కొట్టుకుంటూనే ఉంది. రైలు కదిలి స్టేషన్ దాటగానే ఆమె గుండె కుదుటపడింది.

"జర కూసంత నీరైనా తాగిపించవే! సన్న పానం గుటుక్కుమంటదే!" చంటిపిల్ల ఏడుపు వినలేక చుక్క పిన్నత్త హెచ్చరించింది.

"అట్టగే..!" అంటూ చుక్క పక్కనే ఉన్న గోనెమూట విప్పి సగం విరిగిన ఓ పింగాణీ కప్పు తీసింది. తాగిద్దామంటే నీళ్లు లేవు.

చుక్క మనస్సు చివుక్కుమంది. పిల్ల ఏడుపుతో గుండె గుభిల్లుమంది. ఏమీ చెయ్యలేని అయోమయంలో అందరి వైపు జాలిగా చూసింది.

సీటు మీద కూర్చున్న ఒకామె చుక్కమ్మ బాధ అర్థంచేసుకుంది. పైగా... ఆ చంటిపిల్ల ఏడుపుకు గల కారణం కూడా గ్రహించింది.

"కాసిని నీళ్లు పట్టమ్మా!" అంటూ పక్కనే ఉన్న నీళ్ల సీసా అందించింది.

పెద్దనిధి దొరికినంత సంబరపడింది చుక్క.

ఎవరైనా లాగేసుకుంటారేమోనన్నంత కంగారుగా ఆవిడ చేతిలోని సీసా అందుకుని నీళ్లు కప్పులోకి వంపింది. రైలు వేగానికి నీళ్లు కప్పులో కంటే... అటు ఇటు నీళ్లు తుళ్ళుతున్నాయి. పైగా... కంగారువల్ల చెయ్యి కూడా వణుకుతోంది. దాని మూలంగా నీళ్లు కప్పులో పడటమే లేదు.

అయినా కప్పులో పడిన గుక్కెడు నీళ్లు ఏడుస్తున్న పిల్లనోటి కందించింది.

ఆ పిల్ల నీరు తాగలేదు సరికదా... చేత్తో కప్పు తోసేసింది. ఆ గుక్కెడు నీళ్లూ నేలపాలయ్యాయి. ఏడ్చి ఏడ్చి పిల్ల గొంతు బొంగురుపోతోంది. ఎవరో బిస్కట్టు పెట్టమని ఓ రెండు బిస్కట్లు అందించారు.

ఆ పిల్ల వాటినీ తోసేసింది.

"తల్లివి కాయే? ఆ మాత్రం తెల్వదాయే? పాలు నోట్లో పెట్టయే! అదే ఏడుపు సాలిత్తది!" ఓ పెద్దామె సలహా ఇచ్చింది.

"పాలు ఎప్పుడో ఎండిపోయినాయి. సంటిది తాగుతుంటనే తల్లి దగ్గర పాలుంటయి! ఈరికెలా సెప్పేది పాలు లేవని!" చుక్క మనసులోనే మథనపడింది. అయినా... పమిటకొంగు భుజాల మీదికి కప్పుకుని చనుకట్టు ఆ పిల్లనోటి కందించాలని ప్రయత్నించింది!

ఆ పిల్ల చేత్తో అదీ తోసేసింది. తల పవిట చాటుకు వెళ్లనే లేదు. తల వెనుకకు వాల్చి ఆ పిల్ల మరింత గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది.

"ఎక్కడనుంచైనా ఎత్తుకొచ్చిన బాపతా? అసలు నీ కూతురేనా? నిజం చెప్పు" అప్పుడే అక్కడకు వచ్చిన టికెట్టు కలక్టరు అనుమానంతో బెదిరించి అడిగాడు.

"అసోంటిదాన్ని కాదు బాబా! నా బిడ్డనే! నా పిన్నత్త నడుగు బాబా!" అంటూనే ఆ పిల్లను మరింత గట్టిగా పట్టుకుంది. ఆ పిల్లను ఎవరైనా లాక్కుపోతారేమోనన్న భయం ఆమె చూపుల్లో కదలాడుతోంది.

"ఏందయ్యా అది..? ఆ బిడ్డ ఆమె బిడ్డనేనయ్యా! అమె అసుంటిది కాదయ్యా!" అంది ఆ పిన్నత్త.

"ఆ గౌనేమిటి? మీరు పిల్లలకు అటువంటి గౌనులే వేస్తారా?" తిరిగి టికెట్టు కలెక్టరు ప్రశ్నించాడు.

"ఓ అమ్మాయింట్లో పనిసేత్తే ఈ అంగీ ఇచ్చింది! నీ కాలు మొక్కుతా బాబా?" అంది చుక్క దీనంగా.

"అవునయ్యా!" అంటూ పిన్నత్త వంత పలికింది.

అంతలో చంటిపిల్ల ఏడుపు ఆగిపోయింది.

కళ్ళు తేలేసింది. కాళ్ళు చేతులు నిలేసింది. వంట్లో ప్రాణంలేని బొమ్మలా అయిన ఆ పిల్లను చూసి చుక్క కెవ్వుమంది.

"అదేందే... అలా అయిపోనాదీ?" అంటూ చుక్కతో అక్కడున్న ఆడవాళ్ళు, వారితో పాటు టికెట్టు కలెక్టరు కూడా కంగారుపడ్డాడు.

ఆడ, మగ పిల్లలు చుట్టుముట్టారు.

టికెట్టు కలెక్టరు వారిని అటు ఇటు జరగమని, పిల్ల చెయ్యి పట్టుకు చూశాడు. చేతిలో నాడి సన్నగా కొట్టుకుంటూనే ఉంది. పిల్లను పట్టుకుని చుక్క వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

"ఉండవమ్మా... ఏడుపు ఆపు!" అంటూ అతను పిల్ల ముఖం మీద నీళ్ళు జల్లాడు. మెల్లిగా చంటిపిల్ల కాళ్ళు, చేతులు కదిలాయి.

"అలా ఏడుస్తూ కూర్చుంటే పిల్ల బతుకుతుందా? ఎలాగో అలాగ కాసిని నీళ్ళు తాగించు" అంటూ కసురుకున్నాడు.

ఈసారి చుక్క తిరిగి ఆ పింగాణీ కప్పులో నీళ్ళు పోసి పిల్ల నోరు తెరిచి నోట్లో పోసింది. చంటిపిల్ల నెమ్మదిగా చప్పరించడం మొదలు పెట్టింది. మెల్లిగా అరకప్పు నీళ్ళు తాగగలిగింది. పిల్ల ముఖంలో జీవకళ కదలాడింది.

చుక్క మనస్సు కాస్త కుదుట పడింది.

ఏదో స్టేషన్ రాగానే టికెట్టు కలెక్టరు దిగి ఓ గ్లాసుడు పాలు తెప్పించి ఇచ్చాడు. చుక్క పాలగ్లాసు అందుకుని పిల్లనోట్లో పోయడం మొదలుపెట్టింది.

ఆకలితో నకనకలాడుతున్న ఆ పిల్ల మూతలు పడ్డ కళ్ళతోనే గ్లాసుడు పాలు తాగేసింది. చుక్కతోపాటు అందరూ ఆశ్చర్యంగా పిల్లవైపు చూశారు. ఏ ప్రాణైనా పుట్టగానే ప్రపంచం తెలియకపోయినా ఏడవడం తెలుస్తుంది, ఆకలి తెలుస్తుంది. చుక్క మనస్సు మరికాస్త కుదుటపడింది.

మెల్లిగా రైలు కదిలింది.

టికెట్టు కలెక్టరు మరో కంపార్టుమెంటు ఎక్కినట్టున్నాడు. ఈ కంపార్టుమెంటులోకి రాలేదు. చుక్క మగడు ఎక్కడనుంచో పరుగెత్తుకుంటూ వచ్చి చుక్క పక్కన చతికిలపడ్డాడు.

"ఏందిరా? ఏడబోయినావురా?" పినతల్లి సిన్ని అడిగింది.

చుక్క మాత్రం మగని వైపు కోపంగా చూసింది. అడగవలసిన ప్రశ్నలన్నీ ఆ చూపుల్లోనే గంగడికి కనిపించాయి. అతనికి అంతా అయోమయంగా అనిపించింది.

"ఏమయిందే పిన్నీ!" అంటూ పినతల్లిని అడిగాడు.

జరిగినదంతా వివరించింది ఆమె.

"అయ్యో! అంతపని జరిగినాదా? నేనేమి సేసేది..? మందిని నెట్టుకుంటూ రైలు ఎక్కలేకపోయినా. రైలు కదలినాది.. సివరు డబ్బాలో ఎక్కేసినా? రైలు ఆగిందో, లేదో ఈడ కొచ్చినా?" అంటూ చుక్క వైపు చూశాడు.

ఆ చూపుల్లో జాలి ఉంది. చుక్కకు అతన్ని చూడగానే జాలేసింది. చుక్క కళ్లలో నీళ్లు తిరిగాయి. చంటిపిల్ల మీద పడకుండా కళ్లు ఒత్తుకుంది. పిల్లను గుండెలకు హత్తుకుని నుదుటి మీద ముద్దుపెట్టుకుంది.

"ఈ బిడ్డ నాబిడ్డే?" చుక్క వెక్కివెక్కి ఏడ్చింది.

"నువ్వేడిస్తే నే సూడలేనే! సుక్కా... ఏడవబోకే?! నువ్వేడిత్తే నాకూ ఏడుపొత్తదే?' అంటూ గంగడు చుక్క కన్నీళ్లు తన పైగుడ్డతో వత్తాడు. చుక్కకు ఏదో గుర్తొచ్చినట్లు కంగారుగా గోనెమూట విప్పింది. అందులోనుంచి పిల్లకు ఓ గౌను తీసింది.

"దిక్కుమాలినోళ్ళు... మళ్లీ ఎవరొత్తరో?" అంటూ పిల్లకు తొడిగిన తెల్లగౌను తీసి పసుపు ఎరుపు రంగులలో గవ్వలు కుట్టిన ఆ గౌను తొడిగింది. అదే రంగులున్న కుచ్చు టోపీ పెట్టింది. కాళ్లకున్న వెండిపట్టీలు విప్పి ఆ తెల్లగౌనుతోపాటు ఆ సంచిలోకి తోసి తిరిగి మూటకట్టింది.

"ఏంటే ఇదంతా? ఎవరొత్తరే?" అదంతా అర్థంగాని గంగడు అడిగాడు.

"ఆ టిక్కెట్టాయన అన్నీ అడిగిండు కదా! మల్లా ఇంకొకాయనొత్తే తిరిగి అడుగుతుండుగదా!" అన్న చుక్క వివరణ వినగానే- "నిజమే మల్లా!" అన్నాడు గంగడు.

చుక్క పిల్లను మరోసారి చూసుకుంది. ఆమె మనస్సు గతం వెంట కదిలింది.

చుక్క గంగడు మహబూబ్‌నగర్‌లో ఉండగానే పెళ్ళయింది.

లంబాడీ తండాలో అందరితోపాటు ఇళ్లు కట్టే పని చేసుకునే వారు. కట్టే ఇళ్లకు కాస్త దూరంలోనే వాళ్ళ గుడిసెలుండేవి. గుడిసె అంటే అదో చిన్న తడికెలగూడు. తడికె మీద వాన కురిస్తే లోపలికి నీరు దిగకుండా ఓ ప్లాస్టిక్ కవరు. వంగుని లోపలకి వెళ్లి కూచోవాలి తప్ప- నుంచునే ఎత్తుండదు. అదే పడక గది, అదే హాలు, అన్నీ అదే! పిల్లలు పుట్టేది, పెరిగేది అందులోనే. బయట కలోగంజో కాచుకుని జీవితాలు వెళ్ళబుచ్చుతారు.

కానీ, కొందరు లంబాడీలకు పక్కా ఇళ్లు, భూములు కూడా ఉన్నాయి. ఈ తండాలో ఎవరికీ అంతటి సంపాదన లేదు. అక్కడ పనైపోతే కాంట్రాక్టరు వెంబడి పొట్ట చేత పట్టి బయలుదేరవలసిందే! అదీ వారి జీవనగమ్యం.

ఆ వరుసలోనే వారు కాంట్రాక్టరు వెంట సికింద్రాబాదు చేరుకున్నారు!

అంతస్తుల భవనాలు కట్టాలి. పని చాలాకాలం నడుస్తుందని అందరూ మురిసిపోయారు. అక్కడికి దగ్గరలోనే ఆ స్థలానికి ఎదురుగా అందరూ తమ గుడిసెలు వేసుకున్నారు. ఒక్కపూట పని చెయ్యకపోతే తిండి గడవని బతుకులవి. అయినా మమతలు, మమకారాలు వారిని వెంటాడుతూనే ఉంటాయి. కోరికలు బుసలు కొడుతూనే ఉంటాయి. వాటిని గుండెల్లోనే కుదేసుకుని బతుకుతారు.

పెళ్ళై నాలుగు వసంతాలు గడిచిపోయాయి.

చుక్క ఏ చంటిపిల్ల కంటపడినా ఎత్తుకుని ముద్దు చేస్తోంది. తన వడిలోకి అటువంటి చంటిపిల్ల ఎప్పుడు వస్తుందా అని మురిసిపోతోంది.

కాలం గడుస్తోంది.

ఆమెకు కడుపులో తిప్పడం, వికారం ప్రారంభమయ్యాయి, పుల్లని రుచి కోసం నాలుక తంటాలుపడుతోంది. మామిడి పిందె కనబడితే పరుగులు పెడుతోంది. చుక్కలోని కొత్త నలతని ఆమె పిన్నత్త ఇట్టే గ్రహించింది.

"రాయే! సుక్కా! ఆసుపటాలికి పోదారి" అంటూ ఆమె చుక్కను వెంటపెట్టుకుని దవాఖానాకి బయలుదేరింది.

మొన్నటివరకు వారికి ఆసుపత్రికి వెళ్లి లేడీడాక్టరుకి చూపించుకోవాలని, పురుడు అక్కడే పోసుకోవచ్చని తెలియదు. ఇప్పుడు వారికి కూడా కొన్ని విషయాలు తెలుస్తున్నాయి. ఆ అవకాశాలను ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆసుపత్రి మెట్ల మీద మిట్ట మధ్యాహ్నం వరకు అలా పడిగాపులు పడి కూర్చున్నారు.

పొద్దు ఓ పక్కకు వాలుతుంటే లేడీ డాక్టరున్న గదిలోకి అత్తా, కోడలు వెళ్ల గలిగారు.

ఆవిడ చుక్కను పరీక్ష చేసి మూడవ మాసమని చెప్పింది.

చుక్క మనస్సు సంతోషంతో రెపరెపలాడింది. ఆ లేడీ డాక్టరు బలానికి కొన్ని మందులిచ్చి, గర్భిణీ స్త్రీలు తీసుకొనవలసిన జాగ్రత్తలు చెప్పి, పైగా– అలా చేస్తే పండంటి బిడ్డ పుడతాడని మరీ తెలియజేసింది.

చుక్క మనసులో ఏవో కొత్త కోరికలు అడ్డదిడ్డంగా అల్లుకున్నాయి. శరీరంలో ఏవో కొత్త పులకింతలతో అత్త వెంట ఇల్లు చేరుకుంది. ఆరాత్రి సిగ్గు దొంతరలలో మగనికి ఆ విషయం చెప్పి అతని వొడిలో వాలిపోయింది.

నెలలు నిండే వరకు చుక్క గంపనెత్తిన పెట్టి కూలిపని చేస్తూనే ఉంది.

ఆరోజు సాయంకాలం చుక్కకి నొప్పులు ప్రారంభమయ్యాయి. గంగడు, పిన్నత్త కలిసి ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

వెళ్లిన రెండు గంటల్లోనే నొప్పులు ఎక్కువై చుక్కలాంటి ఆడపిల్ల పుట్టింది.

చుక్కది ఛామనచాయ రంగే అయినా పల్చటి బుగ్గలలో, నూ పువ్వులాంటి ముక్కులో, చారడేసి కళ్లతో, నొక్కుల జుట్టుతో కళకళలాడుతూ ఉంటుంది. చంటిపిల్లకూడా అవే రూపురేఖలతో చూడముచ్చటగా ఉంది.

పడకలు ఖాళీ లేక చుక్కని వరండాలో నేల మీద పరుపులేసి పడుకోపెట్టారు. చుక్కేకాదు.., ఆ వరండాలో చుక్కలాంటి బాలింతలు ఎందరో పడుకుని ఉన్నారు, వారికి అంత కాంతి ఎందుకని కాబోలు అక్కడి లైట్లు కూడా తక్కువ కాంతినీ అందిస్తున్నాయి.

ఆ నీడలోనే గంగడు పసిబిడ్డను చూసి మురిసిపోయాడు.

ఆసుపత్రిలో రాత్రివేళ మగవారిని ఉండనివ్వరు. గంగడు, భార్యాబిడ్డలను వదలలేక కొంపకి తిరిగి వెళ్లిపోయాడు.

ఆ బాలింత పక్కనే పిన్నత్త నడుం వాల్చింది. పగలల్లా కష్టించి పని చేసిన వారందరికి మత్తు నిద్ర ఆవరించింది. రాత్రి కళ్ళు తెరచిన కీచురాళ్ళు ఒకటే రొద చేస్తున్నాయి.

అర్ధరాత్రి దాటింది.

అందరూ గాఢనిద్రలో ఉన్నారు. అంత నిద్రలోనూ చుక్క కొత్త మమకారం కడుపులో ఇమిడి గుండెలు కుదుపుతుంటే చంటిగుడ్డును గుండెలకు హత్తుకుని మరీ పడుకుంది.

అంతలో... ఎవరో వచ్చి చంటిగుడ్డును చుట్టిన చుక్క చేతులను పక్కకు తొలగించి బిడ్డను అందుకుని పరుగెత్తుకుపోతున్నారు.

ఎవరో తట్టిలేపినట్టుగా చుక్క ఉలిక్కిపడి లేచింది.

నిజంగానే పక్కలో చంటిబిడ్డ లేదు.

"నా బిడ్డో..." అంటూ కెవ్వున అరిచింది. మొదట పిన్నత్త ఆపై వరండాలో పడుకున్న అందరూ లేచారు.

చుక్క పక్కన చంటిబిడ్డ లేదు. ఆ విషయం అందరినీ కలచివేసింది. అందరూ ఎవరికి తోచిన విధంగా వారు అటుఇటు పరుగులెట్టారు. కాపలా వ్యక్తి టార్చిలైటు చేతపట్టి మరీ వెతకడం మొదలుపెట్టాడు. వేసిన గేటు వేసినట్టే ఉందనుకున్నారు. కాని, గేటు తీసి ఉంది. అందరూ అటు వెళ్లారు.

దూరంగా ఒక ఆడ మనిషి చేతిలో చంటిపిల్లతో పరిగెత్తడం అందరూ చూశారు. ఆమెను మాత్రం పట్టుకోలేకపోయారు.

చుక్క "నా బిడ్డో!నా బిడ్డో!!" అంటూ గుండెలు బాదుకుని ఏడుస్తోంది.

అంతలో... పోలీసులు, ఆసుపత్రి అధికారులు అక్కడకు వచ్చారు. పోలీసులు చుక్కతో పాటు అందరినీ వివరాలు అడిగారు.

"నీ ముఖానికి ఇంత చక్కటి బిడ్డ ఎందుకే? తిండి పెట్టగలవా? గుడ్డ ఇవ్వగలవా?" అన్న ఆయా మాటలు చుక్క చెవుల్లో గింగురుమన్నాయి. చుక్క ఆ విషయం పోలీసులకి చెప్పింది. పైగా... 'ఆ ఆయా నా బిడ్డనెత్తుకు పోయిం'దనే వెక్కివెక్కి ఏడుస్తూ చెప్పింది.

డ్యూటీలో ఉండవలసిన ఆయా ఎక్కడ వెతికినా కనబడలేదు.అక్కడున్న వారికే కాదు, పోలీసులకీ అనుమానమొచ్చింది.

"ఆమె ఎక్కడున్నా వెతికి పట్టుకుంటాం. నీ బిడ్డను నీకు అప్పచెప్పే పూచీ మాది!" అంటూ అక్కడకు వచ్చిన అధికారులు, పోలీసులు చుక్కకు ధైర్యం చెప్పి అక్కడనుంచి వెళ్లిపోయారు.

మరునాడే పుట్టెడు దు:ఖంతో చుక్క ఆసుపత్రి నుంచి గూటికి చేరుకుంది. మధ్య, మధ్యలో వీలు చిక్కినప్పుడల్లా ఆసుపత్రికి, పోలీసుస్టేషన్‌కి చుక్క మగనితో పాటు ప్రదక్షిణాలు చేస్తూనే ఉంది. పిల్ల జాడ మాత్రం దొరకలేదు.

కాలచక్రం తిరుగుతూనే ఉంది. సంవత్సరం ఇట్టే తిరిగి వచ్చింది.

సికింద్రాబాదులో ఇళ్లు కట్టడం పూర్తయింది. హైదరాబాదు మూసారాంబాగ్‌లో పనుందని కాంట్రాక్టరు చెప్పడంతో లంబాడీ కుటుంబాలన్నీ అక్కడకు చేరుకున్నాయి.

చుక్క గంగడుల మనసంతా సికింద్రాబాదు మీదే ఉన్నా వారు అందరితో పాటు ఆ ప్రాంతం వదలక తప్పలేదు.

“ఓ పిన్నత్తా! లస్కర్‌కాడికి పోయి సూసివత్తమే! బిడ్డ ఏడైన కంటపడతదే!” అంది ఓరోజు చుక్క బాధగా.

“ఏందే? ఎర్రిదానా? ఏడాది పిల్లనేడ గుర్తుపడతవే? పోరి నెత్తుకుపోయినోళ్ళు ఆడనే ఎందుకుంటరే? ఏడనైనా పోయి బతుకుతారే? ఈడైన కంటపడతరే? అయినా... ఇగ నీకుండాలె రాత!” అంది పిన్నత్త అనుభవంతో.

పిన్నత్త మాటల్లో నిజముందని తెలిసినా చుక్క ఆశ చావలేదు. బిడ్డ కోసం అలా వెతుకుతూనే ఉంది.

ఒకరోజు పని ముగించుకుని గూటికి చేరాలని పోతుంటే అటే వస్తున్న ఆయా కంటపడింది. చుక్క ఆమెను ఇట్టే గుర్తుపట్టింది.

పక్కనున్న మగనితో ఆ సంగతి చెప్పింది.

గంగడు పక్కనున్న పిన్నమ్మతో ఆ విషయం చెప్పాడు. ముగ్గురి గుండెలు వేగంగా కొట్టుకుంటుంటే ఆమెను అనుసరించడం మొదలుపెట్టారు. ఆమె కంటపడకుండా ఆమెను ఇంటి వరకు వెంబడించారు.

ఆయా తలుపు తట్టగానే ఒకామె తలుపు తీసింది. ఆమె చేతిలోని పిల్ల ఆయా మీద వాలిపోయింది. ఆయా ఆ పిల్లను ముద్దు పెట్టుకుని భుజాన వేసుకుంది.

“ఓ పిన్నత్తా! నా బిడ్డనేనే? సూడవే?” చుక్క గుండెలు బాదుకుంటూ చెప్పింది.

“గొడవ సెయ్యబోకే? ఈడ మనమున్నమని సూసినాదంటే బిడ్డ మరి మన కంటబడకుండా ఏడనో దాసేత్తదే?” ఆమె మాటలకి భయపడి చుక్క మరి నోరు మెదపలేదు. అయినా... ఏడుపు ఆగలేదు. కట్టలు తెగిన నదిలా ప్రవహిస్తూనే ఉంది.

“సీకటయినాది! పోయి మల్లీ వద్దారి?” ఆమె ఇద్దర్నీ తొందరచేసింది.

ముగ్గురూ తిరుగుముఖం పట్టారు. వాళ్ళు ఆయా ఇంటి మీద ఓ కన్నేసి ఉంచారు. ఆమె ఎప్పుడు ఇల్లు చేరేదీ, ఎప్పుడు ఇల్లు వదిలేదీ అన్నీ తెలుసుకున్నారు. సమయంకోసం ఎదురుచూడ్డం మొదలుపెట్టారు.

ఆరోజుతో ముసారాంబాగ్‌లో పని కూడా పూర్తయింది! కొన్నాళ్లు తిరిగి మహబూబ్‌నగర్‌లోనే ఉండవలసి వచ్చింది. అందరూ వేసుకున్న గుడిసెలు పీకి మూటలు కట్టారు. సామానులు మరో మూటలో సర్దారు. అందరూ అడ్డదారిన కాచిగూడ స్టేషన్‌కి బయలుదేరారు.

చుక్కా గంగడు మాత్రం వీరి వెంట లేరు. ఆయా ఇంటి వైపు కదిలారు. ఆడుకుంటూన్న చంటిపిల్లను చంకనేసుకుని ఆయా ఇల్లు దాటి పరిగెత్తారు. రైలు కదిలే సమయానికి కాచిగూడ స్టేషన్ చేరుకున్నారు. ఆ స్టేషన్‌లోని రణగొణ ధ్వనికి నిద్రపోతున్న చంటిపిల్ల కెవ్వున అరిచి ఏడుపు మొదలుపెట్టింది. ఆ ఏడుపుతోనే చుక్క రైలు ఎక్కింది.

రైలు కీచుమంటూ ఆగడంతో చుక్క ఉలిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చింది. జరిగినదంతా ఒక కలలా అనిపించింది.

"ఏదైనా నా బిడ్డ నాకు దొరికింది... ఈ బిడ్డ నా బిడ్డే!" చుక్క చంటిపిల్లను గుండెలకు హత్తుకుంది.

"అలా కూకుండిపోయావేటి? రైలు కదులిద్ది? దిగు?దిగు!" పిన్నత్త తొందర చేసింది. చంటిపిల్లను చంక నెత్తుకుని, నెత్తిన మూటతో చుక్క కూడా రైలు దిగింది.

అందరూ గేటు దాటి ఊళ్లోకి వెళుతున్నారు.

చుక్క ఓ చెట్టు మొదట్లో కూర్చుండిపోయింది. గంగడికి చుక్క ప్రవర్తన అంతు పట్టలేదు. అయినా... ఏం చెయ్యడానికీ తోచలేదు. తలమీద నున్న బరువు మూట పక్కన పడేసి గంగడు భార్య పక్కనే చతికిలపడ్డాడు. అప్పటికీ రాత్రి పది దాటింది. చుట్టూ చీకటి. అక్కడక్కడ కరెంటు దీపాలు ఆకాశంలోని చుక్కల్లా మిణుకు మిణుకుమంటున్నాయి.

"ఇదిగో! ఈ బిడ్డ మన బిడ్డే! సూసినావా?" అంది చుక్క.

" నేనేడ సూత్తినే? ఆయేల సీకట్లో సూసినా? ఈ యేల ఈ సీకట్లో సూత్తున్నానే?" అంటూ గంగడు పిల్లను ఒళ్లోకి తీసుకుని తనివితీరా ముద్దులు పెట్టుకుని భోరున ఏడ్చాడు.

"ఏడవబోక... మన బిడ్డ మన కాడికి సేరినాది? ఈ బిడ్డను మనం సాకగలమా! కడుపునిండా పాలు ఇవ్వలేము. కూడు పెట్టలేము. ఈ బిడ్డ తిండి లేక మనలాగే మాడిపోద్దేమీ? ఏడ్చి ఏడ్చి బిడ్డ గుటుక్కుమంటే ఏటి సేసేది?" చుక్క పిల్లను పట్టుకుని వలవలా ఏడ్చింది.

అంతలో ఏదో పాసింజరు బండి ఎదురువస్తోంది.

"అదిగో... ఆ బండి ఎక్కి తిరిగి పోదారి..!" అంటూ చుక్క పిల్లను చంక నేసుకుని రైలు వైపు వేగంగా అడుగువేసింది. ఆమె వెనకే బరువు మూటతో గంగడు నడిచాడు.

ఇద్దరు జనరల్ బోగి ఎక్కారు. ఈ రైలుకు అంత జనం లేరు. నిద్రపోతున్న చంటిపిల్లను తను కూర్చున్న బెంచీ మీద పక్కనే పడుకోపెట్టింది. మెళకువ లేకుండా నిద్రపోతున్న చంటి పిల్ల వైపు భయంగా చూసింది. ఊపిరి పీలుస్తుందో, లేదోనని ముక్కు దగ్గర వేలు పెట్టి చూసి ధైర్యంతో తాను ఊపిరి గట్టిగా పీల్చుకుంది.

ఇంకా వెలుగు బాగా రాలేదు. కాచిగూడా స్టేషన్‌లో రైలు ఆగింది. పిల్లను ఎత్తుకుని చుక్క కంగారుగా రైలు దిగింది. ఆమె ననుసరించాడు గంగడు.

"ఏడకి పోదారి?" గంగడు ఎటు వెళ్లాలో తెలియక అడిగాడు.

"ఇంకేడకి... ఆయా ఇంటికే?" చుక్క నిబ్బరంగా సమాధానమిచ్చింది.

"అదేటి? అంత కట్టపడినాక తిరిగి ఇదేటి?"

"ఏటి? ఆలోసన సెయి! ఈ బిడ్డను పెంచలేము! సదువు సెప్పించలేము. పండడానికి మెత్తటి పరుపు ఏడనుంచి తెచ్చేది? మనతో రాల్లు కొట్టి బతకాలా? ఆయా బాగా సూత్తది, సదువు సెప్పిత్తది! నీడ పట్టున పెంచుతాదీ! నడు నడు..." అంటూ మగనిని తొందరచేసింది.

బిడ్డకు తిరిగి తెల్లగౌను తొడిగి, కాళ్లకు గజ్జెల పట్టెలు పెట్టింది. ఆఖరిసారిగా తనివితీరా గుండెలకు హత్తుకుంది, గుండె బండరాయి చేసుకుంది. పిల్లను ఆయా ఇంటి ముందు పడుకోపెట్టి వెనుతిరిగింది.

కటిక నేల తగలగానే చంటిపిల్ల గుక్కపెట్టి ఏడుపు మొదలుపెట్టింది.

తల్లి పేగు కదిలి పిల్లను అందుకోవాలని రెండడుగులు వేసిన చుక్క ఆగిపోయింది. కర్తవ్యం కాళ్లకు సంకెళ్లు వేసింది. అలాగే చూస్తూ కొయ్యబొమ్మలా నిలబడిపోయింది.

ఆయా కాబోలు... తలుపు తీసుకువచ్చి ఏడుస్తున్న చంటిపిల్లను అందుకుంది. చుక్కకు కన్నీటిపొరల మధ్య ఏదీ కనబడలేదు.

కన్నపేగు నులుముతుంటే నడవలేని చుక్కను గంగడే పట్టుకుని ఆ ఇంటికి దూరంగా నడిపించాడు.